# నాయక దేవతా ప్రీత్యర్థం

ఆ నాడు వేటకోసం పోరుకాడినా, ఈ నాడు వేటకోసం పొరుకాడుతున్నా, నానాటికీ వేటి వేటి కోసం జారుతూ, మారుతూ పోతున్నా —

అదంతా – అప్రస్తుత ప్రసంగ సంపుటాలల్లో అవసర అధ్యాయాలు.

ఇదంతా – ఆపద్ధర్మసూత్రాలూ, అవసాన కాల స్తోత్రాలూ, అవలంబించవలసిన అమూల్య తరుణం. తెగించి జారవలసినా, తేరాశతో కోరవలసినా అత్యవసర సమయం.

అందుకే – యీ ప్రార్థనా పదాలు ప్రతి వాడూ భట్టీయం వెయ్యడం, పారాయణం చెయ్యడం ప్రస్తుతం ప్రధానం.

## ఓం

'సంకుచిత వాదులం' అన్న సన్యాసి బిరుదు మాకు వదిలేందుకూ; మాలో కూడా విశాల విశ్వ తత్వం, దేశభక్తీ మణుగులకు మణుగులు కద్దని రుజువ య్యేందుకూ; వీలుగా – రానివాటికోసం రభస రభస చెయ్యకుండేట్టూ, వచ్చిందేదేనా వల్లకాట్లోకి చేరు తున్నా గుడ్లు వప్పగించి వూరుకునేట్టూ —

శ్రీ శ్రీ ఆషాఢభూతీ నాయకంగారూ!

మీ సంచార యాత్రల్తో ఉపన్యాస తీర్థాలతో మమ్మల్ని ఉక్కిరి బిక్కిరి చేసెయ్యండి!...

— ఆమెన్ —

## న

ఎన్నేళ్లకూ పాతపడని సరికొత్త స్వరాజ్యం గారూ!

మా – చాలీ చాలని జీతాలనీ, దొరకనే దొరకని వుద్యోగాలనీ, పనికిమాలిన చదువుల్నీ, భార మైన బ్రతుకుల్నీ, దూరమైన ఆశల్నీ, పరిగలాగా పల్చ పల్చగావున్న పదవులు మినహా సర్వస్వాన్నీ, ఇలాగే– యిలాగే వుండేటట్టు.

ఎంతకూ రోజులు చాలని శ్రీ స్వతంత్ర ప్రభుత్వంగారూ!

నాయక దేవతా ప్రీత్యర్థం

మీ నిత్యనూతనత్వంకోసం, మీపదవీ భద్రత కోసం - మా యీ అద్వితీయ బలిదానం అనంతంగా అవిఘ్నంగా సాగిపోయేట్టు ఆశీర్వదించండీ! ......

— ఆమెన్ —

మః

నిజాన్ని బుట్టలోకీ, అబద్ధాన్ని అచ్చులోకీ నెట్టేందుకూ; ఉన్నవాళ్ళ దోపిడీని లేనివాళ్ళ త్యాగంగా జమ పెట్టేందుకూ; ఫాసిజానికి ప్రజాస్వామికపు చీర కట్టేందుకూ; ప్రజాస్వామికం తలకు నియంతృత్వ కోకలి చుట్టేందుకూ; అన్ని అఘాయిత్యాలకూ చిక్కటి సిల్కు తెరఅడ్డంగా పట్టేందుకూ -

శ్రీ శ్రీ డబ్బుకక్కుర్తిగారూ!

పదికాలాలపాటు మా పత్రికలకు ప్రకటనలు పరామర్శలు ప్రసాదించండీ! ......

— ఆమెన్ —

శి

పన్నులీన్నీ, మిలటరీబూటు తన్నులీన్నీ, ప్రజా రక్షణ చట్టపు కన్నులీన్నీ, వెన్నుల్లోదూరే సన్నీలీన్నీ; అన్నిటినీ యిక అన్నిన్నైనా భరించేందుకు -

శ్రీ గాంధీనామ జపంగారూ!

మా నర నరానా వాతాపిజీర్ణంఐపోండీ!

— ఆమెన్ —

పన్నెండు

## వా

కాల్చే యిళ్ళనీ, దోచే వూళ్ళనీ, చేసే హత్యల్నీ చెరిపే మానాల్నీ, పెరిగే రాక్షసత్వాన్నీ, తరిగే మానవత్వాన్నీ -

శ్రీ శ్రీ పాపాల భైరవుడుగారూ!

కమ్యూనిస్టు బూచి ముసుగులో పెట్టి కప్పెయ్యండీ!

— ఆమెన్ —

## యః

చెప్పేవి చెయ్యకుండేందుకూ. చేసేవి చెప్పకుండేందుకూ, ఏరుదాటి తెప్ప తగలేసేందుకూ, ఏడ్చి చంక కెక్కేందుకూ, మానాభిమానాలు మర్చిపోయ్యేందుకూ —

శ్రీ శ్రీ ముసలితనపు పాపపుణ్యాంగారూ!

ఆ ఉేరిడుమార్కు మొగ మొగానా గుద్ది వేసేందుకు ఓ శాసనం చేయించండీ!...

ఆమెన్ —

శ్రీ శ్రీ కి కృతజ్ఞతతో. 30-3-49.